ప్రారంభించే నాథుడేడి..?

అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అన్నట్లుంది ఆరిలోవ ప్రాంతీయుల పరిస్థితి. ఇక్కడ లక్షలాది రూపాయల వ్యయంతో రైతుబజార్ నిర్మించినప్పటికీ స్థానికులకు తాజా కూరగాయలు, ఆకుకూరలు లభించడం లేదు. అత్యవసరమైతే చిల్లర వర్తకుల వద్ద వారు చెప్పిన ధర చెల్లించి కొనుక్కోవడం... లేదంటే దూరంగా ఉన్న ఎంవీపీ, సీతమ్మధార రైతుబజార్లకు వరుగులు తీయాల్సిందే. నిర్మాణం పూర్తయిన రైతుబజార్‌ను ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే, మార్కెటింగ్ శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం వెనుక మతలబు ఏంటో అర్థంకాక ఆరిలోవ వాసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రజా అవసరాల కోసం వైఎస్సార్ సీపీ పాలనలో రూ.80 లక్షల ప్రజాధనంతో నిర్మించడం వల్లే ప్రారంభించకుండా కూటమి నాయకులు వదిలేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు రైతుబజార్ పరిసరాలు పిచ్చి మొక్కలు, తుప్పలు, దట్టమైన గడ్డితో అస్తవ్యస్తంగా తయారవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.



తోటగరువు వద్ద నిర్మించిన రైతు బజార్



రైతు బజార్ గేటు ముందు రాళ్లు తేలిన పార్కింగ్ స్థలం

- ఆరిలోవలో ప్రారంభానికి నోచుకోని రైతుబజార్
- రూ.80 లక్షలతో వైఎస్సార్‌సీపీ పాలనలో 2023లో నిర్మాణానికి శ్రీకారం
- రైతుల కోసం 38, వ్యాపారుల కోసం 5 షాపులు సిద్ధం
- ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మెన్ గది, మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్ నిర్మాణం పూర్తి
- అయినా ప్రారంభానికి ముందుకు రాని మార్కెటింగ్ శాఖ అధికారులు
- కూరగాయల కోసం ఎంవీపీ, సీతమ్మధార రైతుబజార్లకు వెళ్తున్న స్థానికులు
- త్వరగా ప్రారంభించాలని వేడుకుంటున్న లక్ష మంది ప్రజానీకం

ఆరిలోవ: తమ ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేయమని ఎన్నో ఏళ్లుగా ఆరిలోవ ప్రాంతీయులు పాలకులు, అధికారులను వేడుకుంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి కల నెరవేరలేదు. ఎట్టకేలకు 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరిలోవ ప్రజలకు రైతు బజార్ అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 2023లో అప్పటి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కృషితో జిల్లా మార్కెటింగ్ శాఖ ముందుకొచ్చింది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని రెవెన్యూ విభాగానికి చెందిన సుమారు అర ఎకరానికి పైగా స్థలంలో రైతు బజార్ నిర్మాణం చేపట్టింది. దీని కోసం మార్కెటింగ్ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఇక్కడ మార్కెట్ నిర్మాణ పనులు 2024 మార్చి నాటికి పూర్తయ్యాయి. ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణా షాపులతోపాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మెన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, రైతులు, వినియోగదారులకు తాగునీటిని అందించే ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు.

కరుణించని ఎమ్మెల్యే, మార్కెటింగ్ శాఖ అధికారులు

2024 మార్చి నాటికి రైతుబజార్ నిర్మాణ పనులు పూర్తైపోయాయి. అయితే ఇంతలో సాధారణ ఎన్నికలు రావడం... అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రైతుబజార్ ప్రారంభ విషయాన్ని ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పక్కన పెట్టేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన నిర్మాణం కావడంతో ప్రజలకు ఉపయోగపడిందైనప్పటికీ దాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ అడ్డుకొంటున్నారని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల తర్వాత మార్కెటింగ్ శాఖ అధికారులు దిగొచ్చి నిలిచిపోయిన చిన్నచిన్న పనులు పునఃప్రారంభించారు. సుమారు రెండు నెలల క్రితం మొత్తం పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ రైతు బజార్ వినియోగానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రారంభించే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంత తొందరగా ఇది వినియోగంలోకి వస్తుందా అని వేయి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్నామని, అయినా దీన్ని ప్రారంభించకుండా వదిలేశారంటూ స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రైతుబజార్ ప్రారంభంపై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఇప్పటికీ స్పష్టత లేకుండాపోయింది. ఈ రైతు బజార్ నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంతో దీని ఆవరణ అంతా పిచ్చి మొక్కలు, దట్టమైన గడ్డితో నిండిపోయింది. ఇది ఖాళీగా ఉండడంతోపాటు నిర్మానుష్య ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీన్ని మద్యం, గంజాయిబాబులు విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నారు.



రైతు బజార్ లోపల గదుల మధ్యలో దట్టమైన గడ్డి

ఆశగా ఎదురుచూస్తున్న లక్ష మంది

ఆరిలోవ ప్రాంతంలో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. హనుమంతవాక నుంచి దీన్‌దయాల్‌పురం వరకు కొండవాలు ప్రాంతం... ఆరిలోవ కాలనీ నుంచి బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం వరకు నివాసాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల వారు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎంవీపీ రైతు బజార్, 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతమ్మధార రైతు బజార్‌కు ఆటోలు, సిటీ బస్‌లలో కూరగాయలకు వెళ్లాల్సి వస్తోంది. ఆయా రైతు బజార్లకు వెళ్లడానికి ప్రయాణ ఖర్చులతోపాటు గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్థానిక ఎమ్మెల్యే స్పందించి రైతు బజార్‌ను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

35 ఏళ్ల సేవలు అభినందనీయం



అప్పలనాయుడును సత్కరిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో ఉద్యోగం చేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న మొల్లి అప్పలనాయుడును వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం సత్కరించారు. డెయిరీఫారం వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని అప్పలనాయుడిని సత్కరించారు. సుమారు 35 సంవత్సరాలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటరీ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు మొల్లి వెంకటరమణ, పలు వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'విజయదశమి నాడు జమ్మి చెట్టు నాటండి'

మద్దిలపాలెం: విజయదశమి నాడు పూజ చేసే జమ్మి చెట్టు (శమీవృక్షం) అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. మద్దిలపాలెంలో విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. జమ్మిచెట్టు ఆకులు, బెరడు చర్మ సమస్యలను తగ్గించడంలో, కుష్టు రోగాన్ని నివారించడంలో సహాయపడతాయని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారని వివరించారు. ఆకులను కళ్లకు పూయడం వల్ల చికాకు నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఆకులు, బెరడు పేస్ట్ తేలు కుట్టినప్పుడు ఔషధంగా పనిచేస్తుందని, శమీ చెట్టు బెరడును ఆర్థరైటిస్ చికిత్సలో ఉపయోగిస్తారని తెలియజేశారు. అవాంఛిత రోమాల నివారణకు కూడా జమ్మి ఆకులను ఉపయోగిస్తారని వివరించారు. ఔషధవిలువలున్న ఈ మొక్కను ప్రతీ ఒక్కరూ విజయదశమినాడు నాటి, పెంచాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకంపై చర్చ

మహారాణిపేట: మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర, జిల్లా, వార్డు కమిటీల నియామకాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బర్కత్ అలీ, జోనల్ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.కరీం బాష, రాష్ట్ర కార్యదర్శి హసన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమాంబ సారె ఊరేగింపు



మూలపాలెంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లోని కొత్తమాంబ అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. కొత్తమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మూలపాలెం మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రకాల పండ్లు, స్వీట్లు, పూజా సామగ్రిని అమ్మవారికి సమర్పించారు. మూలపాలెంలోని పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఏయూ నిర్వీర్యం

బీచ్‌రోడ్డు: విశాఖకు గర్వకారణమైన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి ఆరోపించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు రాజకీయ కోణం ఉందని అనడం దారుణమని, గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ అయితే ఆ పార్టీకి చెందిన విద్యార్థి విభాగం టి.ఎన్.ఎస్.ఎఫ్. రోడ్ల మీదకు వచ్చి పోరాటం చేసిందని అప్పుడు సమర్థించారని గుర్తుచేశారు. ఇప్పుడు వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయకండి, ఆంధ్రా యూనివర్సిటీలో సదుపాయాలు పెంచండి, ఆక్సిజన్ సిలెండర్, అంబులెన్స్ ఇవ్వండి, చనిపోయిన మణికంఠకు న్యాయం చేయండి అని సామాన్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు. విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని, మణికంఠ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



చైతన్యనగర్‌లో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు



బొంతల వీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు



శివాజీపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, ముువ్వల సురేష్

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లోని శ్రీ హిమావత్ గౌరీ కనకదుర్గ ఆలయంలో శ్రీ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ దేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి, బోర రాము రెడ్డి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, మీసాల ప్రదీప్, బాల, భక్తులు, బాలబాలికలు పాల్గొన్నారు.

16వ వార్డులో అన్నదానం

జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీ బొంతల వీధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా అమ్మవారికి ఆయన పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు పరశురామ్, కృష్ణ, వేణు, గౌరీ, కుమార్, జోగారావు, రామలింగేశ్వరరావు, జోగా ప్రసాద్, వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.

20వ వార్డులో మహా అన్నసమారాధన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలో విఘ్నేశ్వర సేవా సంఘం, దీపక్ బాయ్స్ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిలు వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, దువ్వి గోవింద్, బుద్దల పెంటరావు, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.

సకాలంలో చికిత్సతో గుండె వ్యాధుల నివారణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అపోలో వైద్యులు

ఆరిలోవ: గుండె సంబంధిత వ్యాధులను ముందుస్తుగా గుర్తించడం అవసరమని అపోలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.కె.పాణిగ్రాహి అన్నారు. అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం కైలాసగిరిపై ప్రపంచ హృదయ దినోత్సవం నిర్వహించారు. గుండె సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీని వైద్యులు ప్రకటించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాణిగ్రాహి మాట్లాడుతూ గుండె జబ్బులను నివారించడానికి వ్యాయామం కీలకమైనదన్నారు. గుండె సమస్యలు తెలుసుకోవడానికి తరచూ పరీక్షలు చేయించుకోవాలని, సకాలంలో చికిత్స పొందాలని సూచించారు. అపోలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జె.శ్రీరామచంద్ర, యూనిట్ హెడ్ డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అపోలో ఆస్పత్రిలో ఆధునిక పద్ధతుల్లో గుండె సంబంధిత పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. గుండె సమస్యల కోసం మరిన్ని సేవలు అందించడానికి పలు ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుభాషా నృత్యాలు.. అదరహో..



ఏపీఎస్ఈబీకాలనీలో దుర్గాదేవి మండపంలో కుంకుమ పూజ



బహుభాషా నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం: ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన బహుభాషా నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విశాఖ స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన అంతర్జాతీయ జానపద, శాస్త్రీయ నృత్య కళాకారులు ప్రదర్శించిన దేశ, విదేశీ నృత్యాలు భక్తులను, ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా జి.డింపుల్, ఎం.జోషిత ప్రదర్శించిన ఉల్లాసభరితమైన బెంగాలీ జానపద నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ఆర్.నాగరాజు పట్నాయక్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఏపీఈపీడీసీఎల్ మాజీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ కె.ఎన్వి రామారావు కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. అసోసియేషన్ చైర్మన్ కొండ్రు రామారావు, ఇన్‌చార్జి కోశాధికారి బి.గురునాథరావు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేద వినుత.. విద్యాప్రదాత

- సరస్వతీ దేవిగా దుర్గామాత
- చదువులమ్మకు విద్యార్థుల పూజలు



లలితా సుందరేశ్వర పీఠంలో సరస్వతీ దేవిగా అమ్మవారు

ఏయూక్యాంపస్: వేదవినుత, విద్యాప్రదాత అయిన సరస్వతీదేవిని భక్తులు, విద్యార్థులు భక్తితో అర్చించారు. తమకు జ్ఞానసంపదను ప్రసాదించమని ప్రార్థించారు.

- కిర్లంపూడి లే అవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠంలో అమ్మవారు సోమవారం సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 27 మంది చిన్నారులతో సరస్వతీ దేవి పూజ చేయించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యం చండీ హోమం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధానార్చకుడు కాండూరి లక్ష్మణ స్వామి అందజేశారు.

దేదీప్యమానంగా దీపారాధన



చండికాదేవి ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేస్తున్న భక్తులు, కమిటీ ప్రతినిధులు



పీతలవానిపాలెంలో సరస్వతీ దేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు, కమిటీ ప్రతినిధులు



సరస్వతీ దేవిగా అలంకరించిన చండికా దేవికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీ చండికాదేవి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక రంగవల్లులు వేసి వాటిపై దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగొందింది. 8వ రోజు అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు కొనసాగాయి. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ మాట్లాడుతూ అక్టోబర్ 1న ఎంవీపీ కాలనీలో అమ్మవారి సారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహన్‌రావు, వెంకటరావు, టీఎస్ మూర్తి, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

600 మంది విద్యార్థులతో సరస్వతీ పూజ

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డులోని పీతలవానిపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణ యువజన సంఘం పీతలవానిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సరస్వతీదేవి పూజల్లో పలు పాఠశాలలకు చెందిన సుమారు 600మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన పీతల రామకృష్ణను సత్కరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: మహిళా శిశు సంక్షేమ శాఖ, విశాఖ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సీడీపీవో కె.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 43వ వార్డులోని ఎం.టి.పాలెం, జీవీఎంసీ 23వ వార్డులోని మద్దిలపాలెం–1 సెంటర్లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆయా ప్రాంతాల్లో స్థిర నివాసులై ఉండాలని, 35 సంవత్సరాలలోపు వయసు ఉండాలని, పదో తరగతి పాసై ఉండాలని తెలియజేశారు. దరఖాస్తులను ఈ నెల 29 నుంచి అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

వ్యాయామం, సమతుల ఆహారంతో గుండె పదిలం



బీచ్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

ఏయూక్యాంపస్: నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా గుండె వ్యాధులను నివారించవచ్చని మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సోమవారం బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని కలిగి ఉండాలని సూచించారు. ఇటీవల వృద్ధులతోపాటు యువతలో సైతం గుండె సంబంధ వ్యాధుల ప్రభావం పెరుగుతోందన్నారు. మారుతున్న జీవన శైలి, అనారోగ్యకర ఆహారపు అలవాట్లను దూరంగా ఉంచాలన్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్ పాడి, డాక్టర్ హేమంత్ బెహరా, డాక్టర్ శ్రీకర్ డాక్టర్ ఎ.సురేష్, డాక్టర్ అశ్వినికుమార్ పాండ, డాక్టర్ సిహెచ్.ఎన్.రాజు, డాక్టర్ శివ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన విజ్ఞానంతో ఆరోగ్యకర జీవనం

ఏయూక్యాంపస్: ప్రాచీన విజ్ఞానంతో ఆధునిక జీవనశైలి ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేకువజామున నిద్ర లేవడం, తాజా పండ్లు, తృణధాన్యాలు, పప్పులు, బాదం ఆహారంలో భాగంగా చేర్చుకోవాలన్నారు.

వాహనాలకు నిప్పంటించిన ఘటనపై కేసు

ఎంవీపీకాలనీ: పెదజాలరిపేటలో ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. పెదజాలరిపేటకు చెందిన మోధి దాసు అదే ప్రాంతంలో ఓ నూడుల్స్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 28వ తేదీ రాత్రి షాపు సమీపంలో తన హోండా యాక్టివా వాహనాన్ని పార్క్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. 29వ తేదీ తెల్లవారుజామున చేపల విక్రయాల కోసం హార్బర్‌కు వెళ్తున్న అతని తల్లి, ఆ వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడాన్ని గమనించింది. దాసుకు తెలియజేయగా అతను వెంటనే అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. వాహనంతో పాటు సమీపంలోని మరో మూడు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.